సాక్షి
వికారాబాద్

శనివారం । 22 । మార్చి । 2025




కోట్‌పల్లి కుండలు భలే!

కోట్‌పల్లి.. కుండలకు పెట్టింది పేరు. ఇక్కడ వివిధ రకాల మట్టి కుండలు, పొయ్యిలు, వంట పాత్రలు తయారు చేస్తారు. 9లో ▸



అడవుల సంరక్షణకు..

అడవుల సంరక్షణ, పునరుద్ధరణకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తహసీల్దార్ విజయకుమార్ సూచించారు. 9లో ▸



న్యూస్‌రీల్

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రండి

సీఎంను ఆహ్వానించిన ఆలయ ధర్మకర్తలు



సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలు

కొడంగల్: పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని ఆలయ ధర్మకర్తలు సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తిరుమల తిరుపతి తరహాలో ఇక్కడ నిత్యం స్వామివారికి వాహన సేవలు నిర్వహిస్తారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిత్య పూజలు, కైంకర్యాలు నిర్వహిస్తారు. సీఎంను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్, రత్నం, ఓం ప్రకాశ్, రాజేందర్ ఉన్నారు.

ధారూరు తైబజార్ వేలం

రూ.6.01 లక్షలకు దక్కించుకున్న మహేశ్



ధారూరు తైబజారుకు నిర్వహిస్తున్న వేలం

ధారూరు: ధారూరు తైబజార్ వేలం శుక్రవారం నిర్వహించారు. తిమ్మానగర్ గ్రామానికి చెందిన కే మహేశ్ రూ.6.01 లక్షలకు పాట పాడి రెండోసారి దక్కించుకున్నారు. గత ఏడాది రూ.4.08 లక్షలకు తైబజార్ దక్కించుకున్నారు. ప్రతి శనివారం నిర్వహించే కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల నుంచి నిర్ణీత రుసుం వసూలు చేసుకోవాల్సి ఉంటుంది. గ్రామ కార్యదర్శి అంజానాయక్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా వ్యాపారులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రంలో ఫ్యాన్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



మల్కాపూర్ పరీక్ష కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్యాన్

తాండూరు రూరల్: మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఫ్యాన్లు, సౌకర్యాలు సరిగ్గా లేకపోవడంపై శుక్రవారం సాక్షి దినపత్రికలో ఇదేం పరీక్ష కేంద్రం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ జిల్లా అధికారులు స్పందించారు. శుక్రవారం పాడైన ఫ్యాన్ల స్థానంలో కొత్తవాటిని అమర్చారు. మరో తరగతి గదిలో కొత్తగా రెండింటిని ఏర్పాటు చేశారు.

24న కౌన్సెలింగ్

అనంతగిరి: జిల్లాలో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్) పోస్టులకు ఎంపికైన 14మంది అభ్యర్థులకు ఈ నెల 24న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరవణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్‌లోని ఎస్ –17 హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



తాండూరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశావర్కర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆశావర్కర్లకు ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, రూ.50 లక్షల ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆశావర్కర్లపై పీహెచ్‌సీ అధికారుల వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు రేణుక, అనిత, అరుణ, యాదమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



పరిగి: కుల్కచర్ల పరీక్ష కేంద్రంలోకి వెళ్లే ముందు తండ్రి పాదాలకు నమస్కరిస్తున్న కూతురు



వికారాబాద్‌లోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



వికారాబాద్ పట్టణంలోని ఓ కేంద్రం వద్ద విద్యార్థులను చెక్ చేసి లోపలికి పంపుతున్న సిబ్బంది



కొత్తగడి రెసిడెన్షియల్ సెంటర్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు నిర్ణీత సమయం కంటే ముందే కేంద్రాలకు చేరుకున్నారు. మొదటి రోజు పరీక్ష కావడంతో విద్యార్థుల వెంట తల్లిదండ్రులు, కుటుంబీకులు వచ్చారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే సెంటర్లలోకి అనుమతించారు. వికారాబాద్ పట్టణంలోని పలు కేంద్రాలను కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎస్పీ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్లలోకి వెళ్లే సమయంలో కలెక్టర్ తన సెల్‌ఫోన్‌ను బయట ఉంచారు. జిల్లా వ్యాప్తంగా 12,892 మంది పదో తరగతి విద్యార్థులు ఉండగా శుక్రవారం నిర్వహించిన తెలుగు పరీక్షకు 12,832మంది హాజరుకాగా 60మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. – అనంతగిరి

సహకారం స్వాహాపర్వం



వికారాబాద్‌లోని డీసీఎంఎస్ కార్యాలయం

- తక్కువ అద్దెలకే డీసీఎంఎస్ ఆస్తులు కట్టబెడుతున్న అధికారులు
- బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే సగమే!
- రైతు సేవలకు దూరమవుతున్న సహకార సంఘాలు
- ఎరువులు, విత్తనాల విక్రయానికి స్వస్తి పలికిన యంత్రాంగం

వికారాబాద్: డీసీఎంఎస్ ఆస్తుల లీజు వ్యవహారంలో సంబంధిత అధికారులు, సిబ్బంది లోపాయికారీ దందాకు తెరతీస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు సేవలే లక్ష్యంగా ఏర్పాటైన సహకార మార్కెట్ సంఘాలు మెల్లగా అన్నదాతలకు దూరమవుతున్నాయి. జిల్లాలో సహకార మార్కెటింగ్ సంఘాల పరిస్థితి దారుణంగా తయారైంది. అధికారుల వ్యవహార శైలిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీసీఎంఎస్‌లకు జిల్లాలో పెద్ద ఎత్తున ఆస్తులు ఉండగా వాటి లీజు కేటాయింపుల్లో లోపాయికారీగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారులతో అధికారులు, ఉద్యోగులు కుమ్మక్కై తక్కువ లీజుకు భవనాలు, దుకాణాలు, గోదాములు కట్టబెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో వందకు పైగా దుకాణాలు, పదికి పైగా గోదాములు, రైస్ మిల్లులు, ఇతర భవనాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ శాతం లీజుకు ఇచ్చారు. మార్కెట్ విలువ కంటే తక్కువ ధరలకు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారు. మార్కెట్ విలువలో సగం కంటే తక్కువ లీజుకు ఇచ్చేరనే విమర్శలు ఉన్నాయి.

ఇష్టారాజ్యంగా దుకాణాల కేటాయింపు

డీసీఎంఎస్‌కు వికారాబాద్‌లో 39 దుకాణాలు, రెండు గోదాములు ఉన్నాయి. తాండూరులో మూడు గోదాములు, 40 దుకాణాలు, ఒక స్కూల్ బిల్డింగ్, ఒక రైస్‌మిల్లు, ఒక దాల్‌మిల్లు ఉంది. పరిగిలో 25 దుకాణాలు, ఐదు గోదాములు, ఒక రైస్‌మిల్ ఉంది. వీటిలోనే ఎరువులు, విత్తనాలు అమ్మేవారు. ప్రస్తుతం దుకాణాలు, గోదాములు, రైస్ మిల్లులను లీజ్‌కు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. దీంతో ఉద్యోగులకు పనులు లేక కార్యాలయాల్లో ఖాళీగా కూర్చుంటున్నారు. దుకాణాల కేటాయింపులో లోపాయికారీగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లో మెయిన్ రోడ్లలో దుకాణా సముదాయాలు ఉన్నాయి. ఇక్కడ ఒక్కో దుకాణం నెల అద్దె రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకు ఉంటుంది. పరిగి పట్టణంలో మున్సిపాలిటీకి ఉన్న దుకాణాలకు వేలం వేయగా నెలకు ఒక్కో దుకాణాన్ని రూ.15 వేల నుంచి రూ.36 వేల వరకు పాడి దక్కించుకున్నారు. ప్రైవేటు వ్యక్తులు సైతం తమ దుకాణాలకు ఇదే తరహాలో రెంట్లు వసూలు చేస్తున్నారు. కానీ డీసీఎంఎస్ అధికారులు మాత్రం లోపాయికారీగా వ్యవహరిస్తూ తక్కువ ధరలకే దుకాణాలు కట్టబెడుతున్నారు. సంస్థకు నష్టం చేస్తూ వారు మాత్రం లాభ పడుతున్నారు. ఒక చోట ఒక దుకాణానికి రూ.4,720, మరో చోట రూ.5,450, ఇంకో చోట రూ.6,680, మరో చోట రూ.9,500 రెంట్లు వసూలు చేస్తున్నారు. రెండేళ్లకోసారి పాత లీజుకే పాతవారికి షాపులను కట్టబెడుతున్నారు.

రైతు సేవలకు స్వస్తి

గతంలో మండల కేంద్రాల్లోని డీసీఎంఎస్‌ల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయించేవారు. ఇవి ప్రభుత్వరంగ సంస్థలు కావడంతో సర్కారు నిర్ధేశించిన ధరలకే ఇచ్చేవారు. డీసీఎంఎస్‌లు అందుబాటులో ఉన్నంత కాలం ప్రైవేటు ఏజెన్సీలు సరైన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించేవారు. దీంతో రైతులకు మేలు జరిగేది. మెల్లమెల్లగా సహకార మార్కెట్ సంఘాలు రైతులకు దూరమవుతూ వచ్చాయి. మొదట మండల కేంద్రాల్లో వీటి సేవలు నిలిచిపోగా తర్వాత నియోజకవర్గ కేంద్రాల్లో.. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోనూ డీసీఎంఎస్‌లకు స్వస్తి పలకడం రైతులకు శాపంగా మారింది. దీంతో అన్నదాతలు తప్పనిసరిగా ప్రైవేటు వ్యక్తుల వద్ద ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రైవేటు వ్యాపారులు రేట్లు పెంచి ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. రైతుల నుంచి సేకరించిన కందులను పప్పుగా మార్చి తాండూరు కంది పప్పు పేరుతో విక్రయిస్తూ సంస్థ లాభాలు ఆర్జిస్తోంది. డీసీఎంఎస్ సేవలకు స్వస్తి పలకడంతో ఇందులో పని చేసే ఉద్యోగులకు పని లేకుండా పోయింది. దీంతో వారు తమ సొంత పనులు చక్కబెడుతూ, ఇతర వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ విధులకు ఎగనామం పెడుతున్నారు.

“ గతంలో కేటాయించారు

వికారాబాద్ పట్టణంలోని డీసీఎంఎస్‌కు చెందిన దుకాణాలు, గోదాంలను నేను బాధ్యతలు తీసుకోకముందే అద్దెకు ఇచ్చారు. గతంలో వీటిలో ఎరువులు, విత్తనాలు విక్రయించే వాళ్లం. వీటిని అద్దెకు ఇవ్వడంతో మాకు పనిలేకుండా పోయింది.

– ఎల్లయ్య, బ్రాంచ్ మేనేజర్, వికారాబాద్

అవినీతి జలగలపై సమగ్ర విచారణ

- అధికారుల పాత్ర ఉంటే కఠిన చర్యలు: డీఎఫ్‌ఓ
- అర్బన్ పార్కులో వాకింగ్ పాత్ పనుల నాణ్యత పరిశీలన

బషీరాబాద్: అంతారం – గొట్లపల్లి అర్బన్ పార్కు వాకింగ్ పాత్ పనుల్లో చోటుచేసుకున్న అక్రమాల్లో అటవీశాఖ అధికారుల పాత్రపై శుక్రవారం సాక్షి దినపత్రికలో 'మట్టి పోశారు.. లక్షలు దోచారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. దీనిపై అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ ప్రియాంక వర్గీస్ ఆరా తీసినట్లు తెలిసింది. డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్‌ను హైదరాబాద్‌కు పిలిపించి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. సాయంత్రం తాండూరుకు వచ్చిన డీఎఫ్‌ఓ.. బీట్, సెక్షన్ ఆఫీసర్లను విచారించడం తోపాటు రికార్డులను పరిశీలించారు. ఎఫ్ఆర్‌ఓ శ్రీదేవి సరస్వతి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మీ పనితీరు సరిగ్గా లేకపోవడం వల్లే అవినీతి ఆరోపణలు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతరం అర్బన్ పార్కును సందర్శించి వాకింగ్ పాత్ పనులను పరిశీలించారు. మట్టి రోడ్డు కొలతలు తీసి నాణ్యతను చెక్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాకింగ్ పాత్ పనుల్లో అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి అధికారుల పాత్ర ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు పనుల్లో భాగంగా చెట్ల తొలగింపు, మట్టి తవ్వడం వంటి వాటిని పరిశీలించి అందుకు కారణమైన వారికి జరిమానా విధిస్తామని తెలిపారు. డీఎఫ్‌ఓ వెంట ఎఫ్ఆర్‌ఓ శ్రీదేవి సరస్వతి, బీట్, సెక్షన్ ఆఫీసర్లు ఉన్నారు.

సాక్షి ఎఫెక్ట్..



అర్బన్ పార్కులో వాకింగ్ పాత్ పనుల కొలతలు తీస్తున్న డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్, ఫారెస్టు అధికారులు

పల్లెల్లో డ్రోన్ల కలకలం

చేవెళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా రాత్రి వేళ డ్రోన్లు సంచరించడం కలకలం రేపుతోంది. మండలంలోని చేవెళ్ల, కందవాడ, ఊరేళ్ల, సింగప్పగూడ, కేసారం తదితర గ్రామాల్లో డ్రోన్లు చక్కర్లు కొట్టాయి. గురువారం రాత్రి 8 నుంచి 9 గంటల సమయంలో డ్రోన్లు తిరిగినట్లు గుర్తించిన కొంతమంది వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఏం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. దీనిపై చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌ను వివరణ కోరగా కందవాడ గ్రామంలో ఆర్‌హెచ్ రీసెర్చ్ అనే కంపెనీ పరిశోధనలో భాగంగా కొద్ది రోజుల పాటు డ్రోన్లు ఉపయోగించుకుంటామని అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. వారే డ్రోన్లు వినియోగించి ఉంటారని, ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. ఏదైనా ఉంటే మళ్లీ ఆ కంపెనీ వారితో మాట్లాడి స్పష్టత ఇస్తామని చెప్పారు.



నూతన ఔషధాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్ర యాదవ్

6 హెచ్‌పీతో టీబీకి చెక్

- హెచ్ఐవీ వ్యాధి గ్రస్తుల కోసం కొత్త ఔషధం
- ప్రారంభించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్

తాండూరు టౌన్: హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు టీబీ నుంచి ఉపశమనం పొందేందుకు నూతన ఔషధం అందుబాటులోకి వచ్చిందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్ తెలిపారు. 6 హెచ్‌పీ (600 మిల్లీ గ్రాములు) ఔషధాన్ని 28 రోజుల పాటు వాడితే వారికి జీవితంలో టీబీ సోకదన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని ఏఆర్టీ సెంటర్‌లో ఈ ఔషధాన్ని పలువురు హెచ్ఐవీ వ్యాధి గ్రస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ వ్యాధి గ్రస్తులు టీబీ సోకకుండా గతంలో ఆరు నెలల పాటు మందులు వాడేవారన్నారు. కొత్తగా వచ్చిన 6 హెచ్‌పీ ఔషధాన్ని 28 రోజుల పాటు వాడితే సరిపోతుందన్నారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు ఈ ఔషధాన్ని తప్పకుండా వాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర సమీవుల్లా, ఫార్మసిస్ట్ రమేష్, రవికుమార్, నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె దవాఖానా.. పశువుల కొట్టమా!

- పదహారేళ్లుగా భవనం నిరుపయోగం
- చోరీకి గురైన కిటికీలు, తలుపులు
- వైద్య సేవలు అందక ప్రజల అవస్థలు



కిటికీలు తలుపులు లేని పల్లె దవాఖానా



భవనంలోని ఓ గదిలో పశువుల మేత, చెత్తాచెదారం

దౌల్తాబాద్: మండల పరిధిలోని ఈర్లపల్లిలో నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనం పశువుల కొట్టంలా మారింది. 2009లో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీన్ని ప్రారంభించారు. కొద్ది రోజుల పాటు ఇక్కడ సేవలు అందించిన వైద్యారోగ్య శాఖ అధికారులు.. వసతులు లేవని, ఊరికి దూరంగా ఉందనే కారణాలతో భవనాన్ని వదిలేశారు. అనంతరం గ్రామంలోని ఓ అద్దె గదిలో సేవలు కొనసాగించారు. ఇటీవల ప్రభుత్వం గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చింది. ఈ క్రమంలో అధికారుల ఆదేశం మేరకు ఈర్లపల్లిలోని ఉప కేంద్రానికి పల్లె దవాఖానా అని బోర్డు పెట్టారు. కానీ ఈ భవనంలో స్థానిక ఏఎన్ఎం కానీ వైద్యాధికారి కానీ ఏనాడూ సేవలందించిన దాఖలాలు లేవు. భవనానికి చెందిన కిటికీలు, తలుపులు చోరీకి గురయ్యాయి. ప్రస్తుతం ఇందులో పశువులను కట్టేస్తున్నారు. వైద్య సేవలు ఎక్కడ అందిస్తున్నారో స్థానికులకు కూడా తెలియని దుస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్



అనంతగిరి: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని అన్ని వసతి గృహ వార్డెన్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి మంచి వాతావరణంలో విద్యార్థులు చదువుకునే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే భవన లీకేజీలు, కిటికీలు, తలుపులను బాగు చేయించినట్లు చెప్పారు. అనంతరం హాస్టళ్ల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి మల్లేశం, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉపేందర్, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీపీఓ సురేష్ మోహన్

కేశంపేట: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులనులత మూడు రోజుల్లోగా వసూలు చేయాలని రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ ఆదేశించారు. మండల పరిధిలోని సంగెం గ్రామ పంచాయతీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి గ్రామంలో ఇంటి పన్నుల వసూళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. సురేష్ మోహన్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, మురుగు కాల్వలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎల్ఆర్ఎస్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.

క్లుప్తంగా

నేడు బహిరంగ వేలం

యాలాల: శ్రీరామ నవమి సందర్భంగా జరిగే జుంటుపల్లి జాతర ఉత్సవాల్లో టెంకాయలు, పులిహోర విక్రయానికి సంబంధించి శనివారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ శ్యాంసుందర్‌రావు, ఈఓ రాజేందర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ వేలంలో పాల్గొనేందుకు ముందస్తుగా రూ.15 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. వేలం ప్రారంభించే గంట ముందు డిపాజిట్ రుసుం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

వ్యర్థాల సేకరణకు వేలం

కొడంగల్ రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 25న ఉదయం 11గంటలకు చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాల సేకరణ, రవాణా చేయు ఏజెన్సీ నియామకానికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 25న నిర్వహించే వేలంలో పాల్గొనే వారు శనివారం సాయంత్రం 4గంటల లోపు కార్యాలయంలో దరఖాస్తు అందించాలన్నారు.

మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

అనంతగిరి: మహిళా రైతులకు యాభై శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిమిట్లు అందజేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రసన్న లక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మహిళ రైతులకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. స్ప్రేయర్ పంపులు-08, మొక్కల రక్షణ పరికరాలు-08, ట్రాక్టర్ వ్యవసాయ పనిముట్లు-13, బ్రష్ కట్టర్-01, పవర్ టిల్లర్-01, ట్రాక్టర్-1 ఉన్నాయని చెప్పారు. అర్హులైన మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామ దేవత విగ్రహం ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన అమ్మవారి విగ్రహం

పరిగి: గుర్తు తెలియని దుండగులు గ్రామ దేవతల విగ్రహాలను ధ్వంసం చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని బసిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామంలోని పోచమ్మ, మైసమ్మ విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. శుక్రవారం పూజలకు వెళ్లిన భక్తులు విగ్రహాలు ధ్వంసమైనట్లు గుర్తించారు. దీంతో వారు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు స్పందించి విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

తల్లీకొడుకు అదృశ్యం

చేవెళ్ల: లేడీస్ టైలర్ వద్దకు వెళ్తున్నానని రెండేళ్ల కుమారుడితో వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన మండల పరిధిలోని ముడిమ్యాలలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఎంజాల కామిని(24), మహేందర్ దంపతులు. వీరికి రెండేళ్ల కుమారుడు సంతానం. గురువారం బ్లౌజ్ కుట్టించుకుంటానని కుమారుడితో కలిసి వెళ్లిన కామిని రాత్రయినా తిరిగి రాలేదు. వారి కోసం మహేందర్ ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన శుక్రవారం చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రాణం తీసిన అతివేగం

- బైక్ అదుపుతప్పి విద్యార్థి దుర్మరణం
- మరో యువకుడి పరిస్థితి విషమం



అరుణ్ మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: అతివేగం ఒకరి ప్రాణం తీయగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. తుర్కయంజాల్ ప్రాంతానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి అరుణ్(21) తన స్నేహితుడు మహేందర్‌తో కలిసి హైదరాబాద్ నుంచి రావిర్యాల్ మీదుగా బొంగ్లూరు వైపు ప్రయాణిస్తున్నారు. రావిర్యాల్ చెరువు సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కేటీఎం బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొడుతూ వెళ్లి గోడను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అరుణ్ అక్కడికక్కడే మృతి చెందగా మహేందర్ కాలు విరగడంతో పాటు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తరలించారు. అరుణ్ మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మొక్కలు నాటారు.. సంక్షరణ మరిచారు

వనమహోత్సవంపై నిర్లక్ష్యపు నీడ

- కాలిబూడిదవుతున్న మొక్కలు
- పట్టించుకోని అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది

నవాబుపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వనమహోత్సవ కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో అభాసు పాలవుతోంది. ప్రతీ సంవత్సరం లక్ష్యం పెట్టుకుని మొక్కలు నాటి.. సంరక్షణ మాత్రం గాలికి వదిలేస్తున్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పేరిట రోడ్లకు ఇరువవైపులా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో వేల సంఖ్యలో మొక్కలు నాటి వదిలేస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా గడ్డి ఏపుగా పెరగడం.. వేసవిలో ఆ గడ్డి ఎండిపోవడం.. ఆకతాయిలు, రోడ్ల పక్కన ఉన్న భూముల రైతులు ఎండిన గడ్డికి నిప్పంటించడంతో గడ్డితో పాటు నాటిన మొక్కలు సతం కాలిబూడిద అవుతున్నాయి. 2019–2024 వరకు మండల వ్యాప్తంగా 25,012 మొక్కలు నాటేందుకు గాను రూ.20,71,725లు వెచ్చించారు.



చిట్టిగిద్ద రోడ్డులో కాలిబూడిదైన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు

సంగం మొక్కలు బతికిన దాఖలాలు లేవు

అవెన్యూప్లాంటేషన్‌లో గత ఐదేళ్లలో అధికారులు 25,012 మొక్కలు నాటగా ప్రస్తుతం సగం మొక్కలయినా బ్రతికిన దాఖలాలు కనిపించడం లేదు. ప్రతి ఏటా వర్షాకాంలో మొక్కలు నాటడం వేసవిలో కాలిబూడిదవడం పరిపాటిగా మారిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎల్లకొండ, లింగంపల్లి, పూలపల్లి, వట్టిమీనపల్లి, చిట్టిగిద్ద, గొల్లగూడ, మాదిరెడ్డిపల్లి, నారెగూడ, నవాబుపేట, పులుమామిడి తదితర గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలు కాలిపోయాయి. ప్రతి ఏటా ఇలానే జరుగుతున్న అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదు.



ఎల్లకొండ-గొల్లగూడ మధ్య మంటల్లో కాలిపోతున్న మొక్కలు (ఫైల్)

అధికారుల తీరుపై ఆగ్రహం

గతేడాది మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ ప్రతీక్‌జైన్ రోడ్ల పక్కన కాలిన మొక్కలను చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ ఒక్క కారణం చాలదా మీ అందరిని సస్పెండ్ చేయడానికి హెచ్చరించినా అధికారుల్లో తీరుమారలేదని ప్రజలు మండిపడుతున్నారు.

2019-2024 వరకు గ్రామాల వారీగా నాటిన మొక్కలు

గ్రామం	నాటిన మొక్కలు					నాగిరెడ్డిపల్లి	320
అక్నాపూర్	503					నారెగూడ	172
అర్కతల	83	ఎక్‌మామిడి	772	మాదారంలో	680	నవాబుపేట	167
అత్తాపూర్	47	గేట్‌వనంపల్లి	1,215	మాదిరెడ్డిపల్లి	1,434	పూలపల్లి	668
చించల్‌పేట్	1,024	గుబ్బడిపత్తేపూర్	510	మమ్మదాన్‌పల్లి	814	పులుమామిడి	932
చిట్టిగిద్ద	2,048	కద్చర్ల	1,590	మీనపల్లికలాన్	1,222	తిమ్మారెడ్డిపల్లి	184
దాతాపూర్	567	కేశవపల్లి	1,071	మూలమాద	371	వట్టిమీనపల్లి	522
ఎత్‌రాజ్‌పల్లి	958	కుమ్మరిగూడ	678	ముబారక్‌పూర్	535	యావాపూర్	48
గంగ్యాడ	1,146	లింగంపల్లి	1,071	మైతాప్‌ఖాన్‌గూడ	1,301	ఎల్లకొండలో	1,140

లెక్కల కోసమే నాటడం



ఉపాధిహామీ, పంచాయతీరాజ్ అధికారులకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయడానికే మొక్కలు నాటుతున్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటిని సరంక్షించే వారే కరువయ్యారు. ప్రతీ ఏడాది రోడ్ల పక్కన మొక్కలు కాలిపోతున్నాయి. ఇవి అధికారులకు కనిపించడం లేదా? ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– బల్వంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్, దాతాపూర్

గడ్డి పెరగకుండా చూడాలి



వనమహోత్సవంలో మొక్కలు నాటుతున్నారు. ఉపాధి హామీ సిబ్బందికి వర్షాకాలంలో పనులు ఉండవు. మొక్కలు కాపాడే బాధ్యత అప్పగించాలి. రోడ్ల పక్కన గడ్డి పెరగకుండా చూసుకుంటే ఈ సమస్య ఉత్పన్నం కాదు. మొక్కలు కాలిపోతుంటే ఉపాధి హామీ సిబ్బంది, అధికారులు ఏం చేస్తున్నట్లు?

– వడ్డె రాములు, మాజీ సర్పంచ్, అర్కతల

మొక్కలు కాపాడుతాం



రోడ్లకు ఇరువైపులా మొక్కలతో పాటు గడ్డి పెరిగి ఎండిపోయింది. ఎవరో ఒకరు గడ్డిని తగుల బెట్టడంతో గడ్డితో పాటు మొక్కలు కాలిబూడిదవుతున్నాయి. ఇక నుంచి అలా జరగనివ్వం. ప్రస్తుతం ఉపాధిహామీ పనులకు కూలీలు వస్తున్నారు. అదే కూలీలతో అన్ని గ్రామాల్లో రోడ్ల పక్కన ఉన్న ఎండిన గడ్డిని తీపిస్తాం. మొక్కలు కాపాడతాం.

– అనురాధ, ఎంపీడీఓ, నవాబుపేట

క్రీడలతో నూతనోత్తేజం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: క్రీడలు యువతలో నూతన ఉత్తేజాన్ని నింపుతాయని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. పట్టణ కేంద్రంలో నెల రోజులుగా కొనసాగుతున్న పెద్దోళ్ల పర్మయ్య మెమోరియల్ మండల స్థాయి క్రికెట్ టోర్నీ శుక్రవారంతో ముగిసింది. ఈ పోటీల్లో విజేతలకు పర్మన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దయాకర్, కేఎస్ రత్నం నగదు బహుమతులు అందజేశారు. విజేత జట్టు ఊరెళ్లకు రూ.50వేలు, రన్నరప్ జట్టు రామన్నగూడకు రూ.25వేల నగదు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా దయాకర్, కేఎస్ రత్నం మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్లారి వైభవ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కె. శివప్రసాద్, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, జహంగీర్, నర్సింలు, పి. ప్రభాకర్, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మత్తు మందు స్ప్రే చేసి..

మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ



బాధితురాలి ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ రవూఫ్

బొంరాస్‌పేట: గుర్తు తెలియని దుండగుడు మహిళపై మత్తు మందు స్ప్రే చేసి ఆమె మెడలోంచి బంగారు పుస్తెలతాడు చోరీ చేశాడు. ఈ ఘటన మండల పరిధిలోని తుంకిమెట్లలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వడ్ల బ్రహ్మచారి పరీక్షకు వెళ్లగా భార్య సుష్మిత ఒంటరిగా ఉంది. మధ్యాహ్నం సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు ఆమె ముఖంపై మత్తు మందు స్ప్రే చేసి ఆమె మెడలోంచి 2.30 తులాల బంగారు పుస్తెలతాడు తెంచుకుని పరారయ్యాడు. బ్రహ్మచారి సోదరుడు శేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులపై చిన్నచూపు తగదు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



పోలీసుల అదుపులో సీఐటీయూ, పీడీఎస్‌యూ నాయకులు

తాండూరు టౌన్: అసంఘటిత రంగ కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ అన్నారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కరించాలనే డిమాండ్‌తో మహాధర్నాకు పిలుపునిచ్చారు. ఈ మేరకు పోలీసులు పలువురు సీఐటీయూ, పీడీఎస్‌యూ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ, బీడీ కార్మికులు, ట్రాన్స్‌పోర్టు హమాలీలు, సెక్యూరిటీ గార్డులు తదితర అసంఘటిత రంగంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో 15 శాతం విద్యారంగ పటిష్టానికి నిధులు కేటాయిస్తామని చెప్పి ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 7.57 శాతం నిధులు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. విద్య, కార్మిక రంగ సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో పీడీఎస్‌యూ సభ్యులు ప్రకాశ్, నవీన్ ఉన్నారు.

మల్కాపూర్‌లో అధికారుల తనిఖీ



నాపరాతి తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారుల బృందం

మైనింగ్ అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ శివారు ప్రభుత్వ భూమిలో నాపరాతి తవ్వకాలపై మైనింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీ చేపట్టారు. గ్రామంలోని సర్వేనంబర్ 72లో ఉన్న అసైన్డ్ భూమిలో అక్రమంగా నాపరాతి తవ్వకాలు చేపడుతున్నట్లు గ్రామస్తులు తుకారాం ఇటీవల కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం తాండూరు మైనింగ్ ఏడీ సత్యనారాయణ, ఆర్ఐ గోపి, సర్వేయర్ మహేశ్ బృందం నాపరాతి తవ్వకాలను పరిశీలించారు. తవ్వకాలను పరిశీలించిన అధికారులు వెనుదిరిగారు. దీంతో గ్రామస్తులు తుకారాం, మహేందర్‌రెడ్డి, చిరంజీవి మైనింగ్ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎటువంటి లీజు లేకుండా జట్బురు మల్లమ్మ, కుర్వ మల్లప్ప పేరిట ఉన్న అసైన్డ్ భూమిలో నెల రోజులుగా తవ్వకాలు చేపడుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమార్కుల అందిస్తున్న లంచాలు తీసుకుని తవ్వకాలను అడ్డుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయమై మరోమారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా ఇదే విషయమై స్పందించిన మైనింగ్ ఏడీ సత్యానాయణ మాట్లాడుతూ.. విచారణ చేశామని ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని అక్కడి నుంచి వెళ్లిపోయారు. రెవెన్యూ ఆర్ఐ గోపి మాత్రం తనకు ఈ విషయమై ఏమీ తెలియదని.. సమాచారం తెలుసుకునేందుకు వెళ్లాలని చెప్పడం గమనర్హం.

డాడీస్ యాప్‌తో వాహనదారులకు మేలు



డాడీస్ యాప్, క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన పత్రాలను అందిస్తున్న సంజీవరెడ్డి

దుద్యాల్: డాడీస్ యాప్ వాహనదారులకు, ప్రయాణికులకు ఎంతో ఉపయోగం అని డాడీస్ రోడ్డు ప్రతినిధి శ్రీశైలం అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని హకీంపేట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. డాడీస్ యాప్‌నకు సంబంధించిన క్యూర్ కోడ్ స్టిక్కర్‌ను వాహనాలకు అంటించి వారి వారి మొబైల్ ఫోన్‌లలో యాప్ ఆక్టివేషన్ చేశారు. దీంతో సంబంధిత బైక్ ప్రమాదానికి గురైనప్పుడు క్యూఆర్ కోడ్ ద్వారా ప్రమాదాన్ని గుర్తించి ఆంబులెన్స్‌కు సమాచారం చేరుతుందన్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా వెంటనే వ్యకికి సంబంధించిన ఫోన్ ద్వారా ప్రమాదం చూసిన వ్యక్తి క్యూర్ కోడ్‌ను స్కానింగ్ చేయడం ద్వారా లోకేషన్ అలర్ట్ వస్తుందని అన్నారు. దీంతో మేము వెంటనే పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందిస్తామన్నారు. వాహనాలు ఉన్న ప్రతీ ఒక్కరు ఈ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సంజీవ రెడ్డి, గ్రామస్తులు వెంకటయ్య, శివరాజ్, భాస్కర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

అబ్దుల్లాపూర్‌మెట్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... మండల పరిధిలోని అనాజ్‌పూర్ గ్రామంలోని శివాలయం వద్ద బస్టాండ్‌లో శుక్రవారం గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో ఉంది. సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి సూరిబాబు అక్కడికి చేరుకుని 108 వాహనానికి ఫోన్ చేశారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది మహిళను పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా మృతిచెందిన మహిళ స్థానికంగా బిక్షాటన చేసుకుంటూ ఉండేదని స్థానికులు తెలిపారు.

తల్లిని గాయపరిచిన కేసులో నిందితుడికి జైలు

రూ.2 వేలు జరిమానా

దోమ: తల్లిని రోకలిబండతో కొట్టి గాయపరిచిన కేసులో పరిగి కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. ఎస్పీ నారాయణరెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామానికి చెందిన సాబెరబేగం తన భర్త ఉస్మాన్‌తో కలిసి 2024 సెప్టెంబర్ 6న ఇంట్లో మాట్లాడుతూ కూర్చుంది. వారి కుమారుడు మహ్మద్ అజీమొద్దీన్ అలియాస్ టిల్లు వచ్చే వరకు తన భార్య నాజియా ఇంట్లో కనిపించలేదు. దీంతో నా భార్యను ఏమన్నారు..? ఇంట్లోంచి ఎందుకు వెళ్లింది అంటూ కోపంతో తల్లిపై రోకలిబండతో దాడి చేయగా ఆమె ఎడమ చేతి విరిగింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. వాదోపవాదనలు వి న్న పరిగి జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి నాగుల శిల్ప ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమాన విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చింది. ఈ కేసులో నిందితుడికి జైలు శిక్ష పడేలా చేసిన పీపీలు యాదయ్య, సమీనబేగంతో పాటు ఇన్వెస్టిగేషన్ అధికారి జి.ఆనంద్‌కుమార్, సీడీఓ కె.నరేశ్‌ను ఎస్పీ నారాయణరెడ్డి అభినందించారు.

పెళ్లి చేసుకుంటానని..

బాలికను ఎత్తుకెళ్లిన యువకుడు

యాచారం: ప్రేమ, పెళ్లి పేరిట ఓ బాలికను యువకుడు అపహరించుకుపోయాడు. ఈ ఘటన యాచారం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సపూరి సంజయ్‌ప్రసాద్, మంజు దంపతులు తమ 14 ఏళ్ల కూతురుతో కలిసి మొండిగౌరెల్లిలోని ఓ పౌల్ట్రీఫాంలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నారు. సికింద్రాబాద్ సమీపంలోని గాంధీనగర్‌లో ఉండే బీహార్‌కు చెందిన సునీల్ కుమార్(19) మూడు నెలలుగా బాలికతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో ప్రేమిస్తున్నానని, త్వరలో పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఈ నెల 19న బాలికను తీసుకెళ్లాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు తమ కూతురును సునీల్‌కుమార్ అపహరించుకుపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సునీల్‌కుమార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అక్రమంగా మట్టి తరలింపు


- మూడు టిప్పర్లు, జేసీబీ సీజ్
- ఎనిమిది మందిపై కేసు

మహేశ్వరం: అక్రమంగా మట్టి తరలిస్తున్న మాఫీయాపై పోలీసులు కేసు నమోదు చేసి నాలుగు వాహనాలను సీజ్ చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని గంగారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గంగారం సర్వే నంబర్ 85లో ఉన్న ప్రభుత్వ భూమిలో కబ్జాలో ఉన్న గ్రామస్తుడు మునావత్ రెడ్యానాయక్‌కు డబ్బులిచ్చిన కట్రావత్ లక్ష్మణ్, మునావత్ నగేశ్, మునావత్ రాజేశ్ మట్టి తవ్వకాలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున దాడి చేసి మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశారు. మట్టిని విక్రయించిన వ్యక్తితో పాటు లక్ష్మణ్, నగేశ్, రాజేశ్, వారి టిప్పర్ డ్రైవర్లు మెగావత్ రాజు, జెటావత్ తుల్సానాయక్, సందీప్ కుమార్ దాస్, మునావత్ కృష్ణం రాజుపై కేసు నమోదు చేశారు. మూడు టిప్పర్లు, ఓ ఇటాచీ వాహనాన్ని సీజ్ చేశారు.

మీసేవలో అధిక వసూళ్లు



ధారూరు మీసేవ కేంద్రాన్ని సీజ్ చేసి వెళ్తున్న ఆర్ఐ స్వప్న



రూ.100కు బదులుగా రూ.150 చెల్లించిన బాధితుడు

- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు
- రేపటి వరకు మీసేవ బంద్

ధారూరు: నిర్ణీత రుసుము కన్నా ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్న మీసేవ కేంద్రాన్ని అధికారులు సీజ్ చేశారు. వివరాలు.. మండల కేంద్రంలోని మీసేవకు దోర్నాల్ గ్రామానికి చెందిన మహిపాల్ నిర్ణీత రుసుముకు మించి డబ్బు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు శుక్రవారం తహసీల్దార్ సాజిదాబేగం ఆర్ఐ స్వప్న, జూనియర్ అసిస్టెంట్ భీంకుమార్‌ను మీసేవకు పంపించారు. పదవ తరగతి పరీక్షల సమయంలో మీసేవ సెంటర్ తెరిచి ఉండడం, జిరాక్స్ సెంటర్ కొనసాగించడంపై ఆర్ఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై తహసీల్దార్ కలెక్టర్ కార్యాలయంలోని ఈడీఎంతో మాట్లాడారు. స్పందించిన ఈడీఎం రేపటి వరకు మీసేవ షట్టర్ తాళాలు ఇవ్వొద్దని సూచించారు. రాజీవ్ యువ వికాస్ పథకం కోసం ఆదాయ, కుల ధ్రువీకరణ దరఖాస్తులకు ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. ఆధార్ అప్‌డేట్‌కు సైతం ఎక్కువ మొత్తంలో తీసుకున్నారని ఫిర్యాదు చేసిన వెంటనే తిరిగి ఇచ్చేశారు. అక్రమాలకు పాల్పడుతున్నట్లు రుజువైనా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు తహసీల్దార్‌ను ప్రశ్నించగా.. మీసేవపై ఇప్పటికే కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని తదుపరి చర్యలు కలెక్టర్ తీసుకుంటారని వివరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలతో పాటుగా వికారాబాద్ జిల్లాకు సాగునీరు అందించేందుకు లక్ష్మీదేవిపల్లి ఎత్తిపోతల పథకం కోసం నిధులు కేటాయించడం అభినందనీయమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, మండల ఉపాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నరసింహనాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివరాములు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాంచందర్, నాయకులు శ్రీను, తుకానాం, కృష్ణయ్య, అమృతయ్య తదితరులు పాల్గొన్నారు.

గొడ్డలితో గొంతుపై నరికి

- భార్యను హత్య చేసిన భర్త
- మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదని దారుణం
- నిందితుడికి రిమాండ్

షాద్‌నగర్ రూరల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి తన భార్యను దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. పట్టణ సీఐ శంకరయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పరశురాములు, జమున (38) భార్యాభర్తలు. వీరి ఇద్దరు కూతుళ్లకు పెళ్లి చేయడంతో అత్తవారి ఇళ్లలో ఉన్నారు. పరశురాములు కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మరింత మద్యం కోసం డబ్బులు ఇవ్వమని భార్యతో గొడవ పడ్డాడు. ఇందుకు ఆమె నిరాకరించడంతో కోపోద్రిక్తుడై ఇంట్లోని గొడ్డలితో జమున గొంతుపై దాడి చేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భూమి డబ్బుల కోసమే..

గతంలో అమ్మిన భూమికి సంబంధించిన రూ.2.50 లక్షలను జమున తెలిసిన వారికి అప్పుగా ఇచ్చింది. భార్యను చంపితేనే ఆ డబ్బులు తనకు వస్తాయని భావించిన పరశురాములు.. నిద్రిస్తున్న జమునపై గొడ్డలితో కిరాతకంగా దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. నిందితుడిని పట్టుకున్న పోలీసులు అతన్ని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. హత్యకు వినియోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో వెలసిన శివ సీతారామాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేశ్, స్థానిక నాయకులు నరోత్తమ్‌రెడ్డి, బాలకుమార్‌గౌడ్, నర్సింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పర్వతాలు, గిరి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.